క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

● పాదయాత్రగా వచ్చి స్వామివారిని దర్శించుకున్న గుళ్లదూర్తి మహిళలు



పాదయాత్రగా ఆలయానికి చేరుకున్న మహిళా భక్తులు

కోవెలకుంట్ల: పట్టణ శివారులో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోరిన కోర్కెలు నెరవేరుతున్నాయని భావించిన మండలంలోని గుళ్లదూర్తి గ్రామానికి చెందిన మహిళలు ఏడు శనివారాలు పాదయాత్రగా ఆలయానికి వస్తామని మొక్కుకున్నారు. ఈ మేరకు మొదటి వారం గ్రామానికి చెందిన 55 మంది సుమారు 10 కిమీ పాదయాత్రగా వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆయుర్వేద వైద్యసేవలకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సూర్యనాయుడు

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణానికి చెందిన ఆయుర్వేద వైద్యులు విశ్వవైద్య సూర్యనాయుడు చేస్తున్న ఆయుర్వేద సేవలకుగాను డాక్టరేట్ పురస్కారం లభించింది. శనివారం తమిళనాడు రాష్ట్రం హోసూరులో జరిగిన ఆసీయ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ సంస్థ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా విశ్వవైద్య సూర్యనారాయణ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేస్తామన్నారు.

కార్మికులపై కక్షసాధింపులు వీడాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివబాలకృష్ణ

బనగానపల్లె రూరల్ : కార్మికులపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు వీడాలని ఏపీ ప్రభుత్వ పాఠశాలల ఆయా అండ్ స్వీపర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివబాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక ఏఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పథకాల్లో స్కావెంజర్స్, హాస్టల్ వర్కర్స్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా ఎంతో మంది పేదలు పనిచేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని, వీరిని రాజకీయాలతో ముడిపెట్టకుండా చూడలన్నారు. అర్ధాంతరంగా తొలగించడం మూలంగా కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బనగానపల్లె అధ్యక్షులు రవి, కార్మికులు పుల్లమ్మ, సుజాతమ్మ పాల్గొన్నారు.

విద్యార్థి బస్సులు ఏర్పాటు చేయాలి



ఫుట్‌బోర్డు ప్రయాణం వద్దని విద్యార్థులకు సూచిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డోన్ టౌన్: పాఠశాలలు ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నప్పటికీ విద్యార్థి బస్సులను ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని, విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం విద్యార్థులు డోన్ నుంచి స్వగ్రామాలకు వెళ్లేందుకు రద్దీ బస్సులో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తుండగా ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకుని వారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాఠశాలలు, కళాశాలల సమయపాలన పాటిస్తూ ప్రత్యేకంగా విద్యార్థి బస్సులు నడిచేవని, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో సమంజసం కాదన్నారు. విద్యార్థులు ప్రమాదకర ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు. విద్యార్థి బస్సులు ఏర్పాటు చేయకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఆర్టీసీ డిపోను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకురాలు షేక్ సాహిద్‌పాల్గొన్నారు.

సంతాపం

బనగానపల్లె : మండలంలోని మిట్టపల్లె గ్రామానికి చెందిన కాటసాని శివరామి రెడ్డి(57) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ గ్రామానికి చేరుకొని శివరామిరెడ్డి మృతదేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నిరుపయోగం!

● జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్
● తప్పని తాగునీటి ఇబ్బందులు





జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు నోచుకోని మినరల్ వాటర్ ప్లాంట్

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని మినరల్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. దీంతో విద్యార్థినులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసిన విషయం తెలిసిందే. నాడు–నేడు పథకం కింద అదనపు గదులతోపాటు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మౌలిక వసుతులు కల్పించారు. ఈ నేపథ్యంలో స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినుల సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది గత ప్రభుత్వం. ప్రస్తుతం అందుకు విరుద్ధంగా మారింది పరిస్థితి. ప్లాంట్ నిరుపయోగంగా మారింది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈ నెల 12న పునఃప్రారంభం అయ్యాయి. ఈ పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1,000 వరకు మంది విద్యార్థినులు విద్యనభ్యశిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయకపోవడంతో తాగునీటికి విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థినులు బోరు నీటినే వాడుతుండగా మరికొందరు ఇంటి నుంచే వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. సమస్యను హెచ్ఎం బాల గంగధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మినరల్‌వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన సంస్థ దృష్టికి తీసుకెళ్లీ మరమ్మతులు చేయిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బేతంచెర్ల: పట్టణాభివృద్ధితోపాటు 20 వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు సమావేశంలో విన్నవించారు. అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బిల్లులు సభ్యుల ఆమోదంతో తీర్మానం చేశారు. దుర్గాపేట, వడ్డెపేట కాలనీల్లో తాగునీటి సమస్య ఉందని, పరిష్కరించాలని కౌన్సిలర్స్ కుమారి, అంజి, గోపాల్ విన్నవించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపొందడంతో నగర పంచాయతీ కార్యాలయం వద్ద ముందుస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డోన్ సీఐ, నంద్యాల ఫ్యాక్షన్ జోన్ సీఐ, బేతంచెర్ల ఎస్ఐ శివ శంకర్ నాయక్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు నాగవెంకటేశ్వర్లు, పర్వీన్, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, ఇబ్రహీమ్, మధు, ఎల్లయ్య, కోట్ల మధు సూధన్, యంగమ్మ, మహేశ్వరి, శకుంతల, నాగజ్యోతి, హుసేన్‌బీ, అబీదా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి



నగర పంచాయతీ కార్యాలయం ఎదుట పోలీసులు బందోబస్తు

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

కోవెలకుంట్ల: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా కోవెలకుంట్ల బజార్ బ్రాంచ్‌లో సీనియర్ హెడ్ మెసెంజర్‌గా పనిచేస్తున్న దస్తగిరి, స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆఫీస్ సబార్డినేట్ సుబ్రహ్మణ్యం పదవీవిరమణ సందర్భంగా శనివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సింహాచలం, బ్రాంచ్ మేనేజర్ రేష్మా ఆధ్వర్యంలో దస్తగిరిని ఘనంగా సన్మానించారు. అలాగే డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణదాసు, నరేంద్రనాథరెడ్డి, అన్నపూర్ణ, లక్ష్మిదేవి, బ్యాంకు సిబ్బంది గంగాధర్, ఖాజాఉసేని, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



బాబుసాహెబ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం



యుగంధర్‌రెడ్డి దంపతుల్నిని సన్మానిస్తున్న చిన్ననాటి స్నేహితులు

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని డోన్ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ బాలకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక పాదుపు భవనంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బాబు సాహెబ్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. బాబుసాహెబ్ దంపతులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, ఉపసర్పంచ్ బురానుద్దిన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు యల్లయ్య, సురేష్, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కోసిగి: మండల పంచాయతీరాజ్ ఏఈ యుగంధర్ రెడ్డి పదవీ విరమణను పురస్కరించుకుని శనివారం ఆయనను ఉద్యోగులు, రాజకీయ నాయకులు, స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఏఈ యుగంధర్‌రెడ్డి దంపతులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. యుగంధర్‌రెడ్డి సేవలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభావతి, ఎంపీపీ ఈరన్న, రాష్ట్ర యూత్ కమిటీ సభ్యులు ప్రదీప్‌రెడ్డి గుర్తు చేశారు.

మార్కెట్‌లో అక్రమ కట్టడాలు కూల్చివేత



మార్కెట్‌లో నిర్మించిన అక్రమ కట్టడం (ఫైల్)



అక్రమ కట్టడాన్ని కూల్చివేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

డోన్: అత్యాధునిక వసతులతో పాతబస్టాండ్ సమీపంలో నిర్మించిన కూరగాయల మార్కెట్‌లో అక్రమ కట్టడాలను శనివారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. అస్తవ్యస్తంగా కూరగాయల మార్కెట్ అనే శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన వార్తకు స్పందించి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో మేస్త్రీలు దేవదానం, లక్ష్మిరెడ్డి, సచివాలయ అధికారులు, సిబ్బంది అక్రమ కట్టడాలను కూల్చివేశారు. దీంతో మార్కెట్‌కు నిత్యం వచ్చే ప్రజలు, చిరు వ్యాపారులు అసౌకర్యం తొలగింది. అక్రమ కట్టడాలను అధికారపార్టీ నాయకులు ప్రోత్సహించి ప్రజలకు, చిరు వ్యాపారలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం



తొట్టిలోని నీటిని పారబోస్తున్న మున్సిపల్ సిబ్బంది

డోన్ : వర్షాకాలంలో అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం ప్రజలకు సూచించారు. స్థానిక 12వ వార్డులో శనివారం ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీలలోని ఇళ్ల వద్ద నీటి నిల్వ తొట్లను ఆయన పరిశీలించారు. నిల్వ ఉంచిన నీటిని పారబోయించారు. తొట్లలో నీటిని ఎక్కువ కాలం ఉంచుకుంటే అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

సంజామల: నంద్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆకుమల్ల గ్రామానికి చెందిన పూల నబీ రసూల్ (55) మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్ రెడ్డి శనివారం తెలిపారు. ఈనెల 22న శ్రీరాముల రాజుతో కలసి పూల నబీ రసూల్ ఆల్వకొండ గ్రామానికి చెందిన రామయ్య పొలంలో విద్యుత్ తీగె లాగుతున్న సమయంలో విద్యుత్‌షాక్ తగిలి ట్రాన్స్‌ఫారర్ టీపీపై పడ్డాడు. తలకు బలమైగాయం కావడంతో నంద్యాల ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చేర్పించగా శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం శవ పరీక్షలు నిర్వహించారు. మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు.

ప్రిన్సిపాల్ వసుంధరదేవిని సస్పెండ్ చేయాలి



పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్ రూరల్ : అక్రమంగా సీట్లు అమ్ముకుంటున్న మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వసుంధరదేవిని వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణ సమీపంలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరిట్ లిస్టులో ఉన్న వారికి కాకుండా తనకు డబ్బులు ఇచ్చిన వారికి సీట్లు ఇవ్వడం దారుణమన్నారు. అలాగే ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం మూలంగానే శుక్రవారం పాఠశాల నుంచి ఇద్దరు బాలికలు పారిపోయారన్నారు. ఆ బాలికలను పోలీసులు గుర్తించకుంటే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్, శశిధర్‌రెడ్డి, ధనుష్, ధర్మతేజ, అరవింద్, శివ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



కోవెలకుంట్ల: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్

కోవెలకుంట్ల: కక్షిదారులకు రాజీయే రాజమార్గమని న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ సూచించారు. స్థానిక జూనియర్ సివిల్‌కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. కోవెలకుంట్ల, సంజామల, రేవనూరు, ఉయ్యాలవాడ, దొర్నిపాడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాజీ కాబడిన 74 కేసులు పరిష్కరించారు. ఐపీసీ 53, ఎంసీ ఒకటి, ఎన్ఐ యాక్ట్, టైటిల్‌కు సంబంధించి రెండు చొప్పున, మనీషూట్ ఎనిమిది, భూ తగాదాలు రెండు, పీఎల్‌సీ బ్యాంకు కేసులు ఆరు, బీఎస్ఎన్ కేసులు రెండు రాజీకావడంతో కేసులను కొట్టివేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయా కేసులకు సంబంధించి రూ. 33.21 లక్షలు కోర్టుద్వారా వసూలైంది. కార్యక్రమంలో న్యాయవాదులు నరసింహ, ప్రేమ్‌నాథ్, తిరుపతయ్య, తిరుపాలు, శ్రీనివాసులు, రమేష్, సుధాకర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లె: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ఇన్‌చార్జీ జూనియర్ సివిల్ జడ్జీ అబ్దుల్ రహిమాన్

లోక్ అదాలత్‌లో 31 కేసులు పరిష్కారం

బనగానపల్లె రూరల్ : స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 31 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి, బనగానపల్లె ఇన్‌చార్జ్ జడ్జి ఎస్ అబ్దుల్ రహిమాన్ ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌తో 29 క్రిమినల్ కేసులు, ఒక చెక్‌బోన్స్, ఒక టైటిల్ షూట్ కేసు పరిష్కారమైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, జూనియర్, సీనియర్ న్యాయవాదులు కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

130 కేసులు పరిష్కారం



డోన్ : లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి

డోన్ టౌన్: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో కక్షిదారుల నుంచి విశేష స్పందన లభించింది. సబ్‌కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో మొత్తం 130 కేసులకు సంబంధించిన కక్షిదారులు రాజీ కావడంతో వారి కేసులు కొట్టివేసినట్లు సీనియర్ సివిల్‌జడ్జి తంగమని, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అండేడ్కర్, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతి తెలిపారు. సీసీ 99 కేసులు, ఎక్సైజ్ 5, ఎంసీ 3, వీసీ 2, ఈపీ 3, ఓఎస్ 5, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈపీ 1, పీఎల్‌సీ 16 కేసులు పరిష్కరించినట్లు న్యాయమూర్తులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 6వ తరగతిలో ఎస్సీ, ఎస్టీ, 7వ తరగతిలో ఎస్సీ, 8వ తరగతిలో ఎస్సీ, ఎస్టీ కేటగిరి విభాగాల్లో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు రాత పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. పరీక్షలో ప్రతిభ ఆధారంగా మెరిట్, వెయిటింగ్ జాబితాలను నోటీస్ బోర్డులో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

ప్రోత్సాహక బహుమతుల అందజేత



నగదు, జ్ఞాపిక అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బనగానపల్లె రూరల్ : 2023–24 పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మండలంలోని ఇల్లూరు కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఆ స్కూల్ పూర్వ విద్యార్థులు మల్లారెడ్డి, కోడినాగేష్,తులసిరెడ్డి, బలరామ్, రాంమద్దిలేటిరెడ్డి ప్రోత్సాహక నగదు బహుమతితోపాటు జ్ఞాపికను అందజేశారు. ఉత్తమ మార్కులు సాధించిన విష్ణు వర్ధన్‌రెడ్డి (579), ఏ గౌతమి (569), నందినికి (568) వరుసగా రూ.5వేలు,రూ.3వేలు,రూ.2వేలు చొప్పున అందజేశారు. అదేవిధంగా పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మణమూర్తి తనవంతుగా వీరికి రూ.1500ల, రూ.900, రూ.600 చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

బేతంచెర్ల: జూలై 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రవి ప్రసాద్ శనివారం తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పింఛన్ల పంపిణీకి సంబంధించి మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. సోమవారం ఉదయం 6గంటల నుంచి ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదును అందజేస్తారన్నారు. మండలంలో 10,489 మంది లబ్ధిదారులకు రూ.7,10,57,000 అందజేయడం జరుగుతుందన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో గ్రామ పంచాయితీ నిధులతో పలు వీధుల్లో వీధిలైట్లు అమర్చుతున్నట్లు సర్పంచ్ శివరాముడు శనివారం తెలిపారు. నాయినపల్లె రోడ్డు,ఉన్నత పాఠశాల నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఎస్సీ కాలనీ, చల్లా కాలనీ,జమ్ములమడుగు క్రాస్ రోడ్డులో సుమారు వంద మేర వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రెండు రోజుల్లో అన్ని వీధుల్లో పూర్తి చేస్తామని సర్పంచ్ చెప్పారు.

నేడు పలువురు ఉద్యోగుల పదవీ విరమణ

కోవెలకుంట్ల: పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఆదివారం పదవీ విరమణ చేయనున్నారు. సబ్‌రిజిస్ట్రార్ సర్వేశ్వరనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, ఎస్‌బీఐ బజార్‌బ్రాంచ్ ఉద్యోగి దస్తగిరి, ఆర్అండ్‌బీలో పనిచేస్తున్న రాయప్ప పదవీ విరమణ చేయనున్నట్లు ఆయా శాఖల అధికారులు పేర్కొన్నారు.

దళితులకు డీలర్‌షిప్‌లు కేటాయించాలి

డోన్ టౌన్: ప్రభుత్వ రేషన్‌షాపుల డీలర్‌షిప్‌లను ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ పద్ధతిలో కేటాయించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హుసేనప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు చెందిన నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించి దళితుల ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని కోరారు.

పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

డోన్ : జూలై 1వ తేదీన చేపట్టే ఇంటింటికీ పింఛన్ పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సచివాలయ ముఖ్య అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం 6 గంటల నుంచే సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టాలని సూచించారు. డోన్ అర్బన్ ప్రాంతంలో 5,500 మంది లబ్ధిదారులకు 130 మంది సచివాలయ అధికారులు పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు.

వాసవీ విద్యా పథకానికి దరఖాస్తుల స్వీకరణ

డోన్ టౌన్: ఆవోపా, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాసవీ విద్యా పథకం కింద ఆర్థిక సాయం పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్య కులానికి చెందిన పేద విద్యార్థులు ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న వారు అర్హులన్నారు. జూలై 10 వ తేదీలోగా పూర్తి సమాచారంతో దరఖాస్తులను ఆర్యవైశ్య సంఘం కార్యాలయం, లేదా తనకు వ్యక్తిగతంగా కలసి అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9441656609ను సంప్రదించాలన్నారు.